బీఏఎస్ఎల్పీ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్పీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు.

- బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ కోర్సుల మొదటి, రెండు, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.
- ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ పోలీస్ మేనేజ్‌మెంట్ (ఎండీపీఎం) పరీక్షా ఫీజు ఈ నెల 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను మార్చి నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
- ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) ఫలితాల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.10వేలు చొప్పున చెల్లించి, వచ్చే నెల 1వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సదరం క్యాంపులు

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 31 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిబ్రవరి 8, 15, 22, 29 తేదీలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి పద్మ జారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

హిమాయత్‌నగర్, జనవరి 31 : సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకు హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో జరుగనున్నాయి. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరుకానున్నారని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి తెలిపారు.

19 పీహెచ్‌డీ రిసెర్చ్ మెథడాలజీ కోర్స్ వర్క్

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ విద్యార్థుల కోసం రీసెర్చ్ మెథడాలజీ (కోర్స్ వర్క్) ఫిబ్రవరి 19 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు బుధవారం యూనివర్సిటీ అధికారులు వెల్లడించారు. రూ.5వేలు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

హెచ్ఎండీఏపై నేడు సమీక్ష

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ సమగ్ర పనితీరుపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ గురువారం సమీక్ష నిర్వహించనున్నారు. గత రెండు నెలలుగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రాజెక్టులు ఎక్కడివక్కడే అన్నట్లుగా ఉన్నాయి. అంతేకాకుండా భవన నిర్మాణాలు, లేఅవుట్‌లకు అనుమతులు ఇవ్వడం లేదు. గురువారం జరుగనున్న సమీక్ష తర్వాత గ్రీన్ సిగ్నల్ వస్తుందనే భావనలో దరఖాస్తుదారులు ఉన్నారు.

నగరంలో నేడు..

1) సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గం.కు శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైందవి స్వరాజ్ దివాస్.
2) సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 4 గం.కు 'మూడు దారులు' పుస్తకావిష్కరణ సభ.
3) రవీంద్రభారతిలో సాయంత్రం 5:30 గంటలకు అక్కినేని అభినయ పురస్కారాల ప్రదానోత్సవం.

పాత అనుమతులతో.. అక్రమ వెంచర్లు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి లేకుండా చేసిన వెంచర్‌లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ

- గృహ సముదాయాలను ఆనుకునే రెండు, మూడు ఎకరాల్లో ఏర్పాటు
- బిల్డర్లతో అధికారుల మిలాఖత్
- దర్జాగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
- అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్న రియల్టర్లు
- జేబులు నింపుకొని ప్రభుత్వ ఆధాయానికి గండికొడుతున్న అధికారులు
- బండ్లగూడజాగీర్ మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న దందా

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : నగర శివారు ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధి దాటిన తర్వాత ఉన్న గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు చేస్తున్నారు. పాత తేదీల్లో గ్రామ పంచాయతీ అనుమతులను సృష్టించి చిన్న బిల్డర్ల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. ఇలా శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటవుతున్న వెంచర్లకు విద్యుత్ శాఖ అధికారులు దర్జాగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. అందుకు ప్రత్యేక నిదర్శనం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు చోట్ల 2, 3 ఎకరాల్లో చిన్న చిన్న లేఅవుట్లుగా చేసి, అందులో జీ ప్లస్ వన్ అంతస్థుల్లో స్థానిక బిల్డర్లతో ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. రియల్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను అటు వైపు కన్నెత్తి చూడకుండా మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ వెంచర్లలో పాత అనుమతులతోనే ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాల్సిన ప్రభుత్వ అధికారులే అవినీతికి పాల్పడుతున్న పరిస్థితి ఇక్కడ ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలో లేఅవుట్ చేయాలంటే హెచ్ఎండీఏ లేదంటే మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీని ప్రకారం ప్రభుత్వానికి ఫీజుల రూపంలో లక్షల్లో ఆదాయం వస్తుండగా, రోడ్ల కోసం 30శాతం, పార్కులు, ఇతర అవసరాల కోసం మరో 10శాతం భూమిని వదిలి పెట్టాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయకుండా ఉండేందుకు పాత లేఅవుట్ అంటూ చెబుతూ 25 ఫీట్లతోనే రోడ్లను వేసి, పార్కుకు గజం స్థలం కూడా వదలకుండా ప్లాట్లను చేసి విక్రయిస్తున్నారు. అయితే చిన్న లేఅవుట్లన్నీ ఇండ్లకు సమీపంలోనే ఉండడంతో నేరుగా ఇంటి నిర్మాణం చేపట్టి విక్రయాలు చేసేలా బిల్డర్లకు వాటిని విక్రయిస్తున్నారు. మున్సిపల్ అధికారుల అవినీతికితోడు విద్యుత్ అధికారులు అనుమతి లేని వెంచర్లలో పెద్ద మొత్తంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ఏర్పాటు చేస్తుండటంతో నిర్మాణాలు శరవేగంగా చేపడుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని రాబట్టాల్సిన అధికారులే అడ్డదారుల్లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు శివారు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లను ఏర్పాటు చేసి, ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ జరిగేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయ శిఖరాలకు అభిషేకం చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

బల్కంపేటలో మహా కుంభాభిషేకం

అమీర్‌పేట్, జనవరి 31 : బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో జరుగుతున్న శ్రీ శతచండీ యాగ సహిత మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా తుది ఘట్టమైన ఆలయ శిఖరాలకు కలశాభిషేకం బుధవారం భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా జరిగింది. కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి చేతుల మీదుగా కలశాభిషేకం వైభవంగా జరిగింది. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు.

జీహెచ్ఎంసీలో 10 మంది ఉద్యోగులకు సన్మానం

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన పలువురు జీహెచ్ఎంసీ ఉద్యోగులను బుధవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో అడిషనల్ కమిషనర్ సరోజ, లేబర్ సెక్షన్ పర్సనల్ ఆఫీసర్ విజయ భాస్కర్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ జయంత్ శాలువా కప్పి సన్మానించారు. రిటైర్డ్ అయిన చార్మినార్ సర్కిల్ కామాటిగా పనిచేసిన సీహెచ్ కృష్ణ, శంకర్, సోమయ్య, ప్రధాన కార్యాలయంలో పనిచేసిన బలరాం, ఖైరతాబాద్ సర్కిల్‌లో శానిటరీ జవాన్ మురళీ కృష్ణ, జైకుమార్, వెంకటమ్మ, స్వీపర్ ఎన్.బాల్‌రాజ్, లక్ష్మి ఉన్నారు.

డ్రామా, మోనో యాక్షన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ నేషనల్ గ్రీన్ కోర్స్ (ఎన్‌జీసీ), హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ సమన్వయంతో ప్రైవేటు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు డ్రామా, మోనో యాక్షన్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారిని ఆర్.రోహిణి తెలిపారు. ఈ నెల 29న సిస్టర్ నివేదిత స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 25 స్కూళ్లకు చెందిన విద్యార్థులు హాజరై పోటీల్లో పాల్గొనగా విజేతలకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు, ఎన్‌జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధిక, సిస్టర్ నివేదిత డైరెక్టర్ హరహర ప్రసాద్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రమాప్రభను సత్కరించిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ముషీరాబాద్, జనవరి 31 : భక్తిభావనలను పెంపొందించే త్యాగరాజ స్వామి కీర్తనలు తెలుగు భాషా సంపదని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రముఖ సంగీత గురువు వై.రమాప్రభను సత్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ, ఆంధ్రామీల్స్‌కు డిమాండ్

పీఈపీఎల్-ఓఎన్‌డీసీ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రజలు ఇష్టపడే భోజన పదార్థాలలో బిర్యానీ, ఆంధ్రా మీల్స్ అగ్రస్థానంలో ఉన్నాయని 'పేటీఎం ఈ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పీఈపీఎల్)-ఓఎన్‌డీసీ' వెల్లడించింది. నగరంలో కష్టమర్ల మనసు చూరగొన్న టాప్ రెస్టారెంట్ల వివరాలను వెల్లడిస్తూ.. బుధవారం నగరంలో ఆహార ట్రెండ్స్‌పై నివేదికను విడుదల చేసింది. అందులో భాగంగా టాప్ రెస్టారెంట్‌లలో మొదటి స్థానంలో బహార్ బిర్యానీ కేఫ్ ఉండగా రెండో స్థానంలో చిక్‌ఫేట్ దొన్నే బిర్యానీ హౌస్, తర్వాతి స్థానాల్లో ది బిర్యానీ లైఫ్, ది ఫుడ్ ట్రైన్ ఫ్యామిలీ రెస్టారెంట్, జైకా రెస్టారెంట్, ఏ-1 చికెన్ పకోడా పాయింట్, రెడ్ బకెట్ బిర్యానీలు ఉన్నట్టు పేర్కొంది. ఈ రెస్టారెంట్స్‌లో అందిస్తున్న డిస్కౌంట్‌లను సైతం వెల్లడించింది. భోజన ప్రియులు తమ ప్లాట్‌ఫాం ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) ద్వారా అత్యధికంగా డిస్కౌంట్‌లు పొందుతారని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సేవలందిస్తున్న ఓఎన్‌డీసీకి ఆహార ప్రియుల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదని తెలిపింది.

రంగారెడ్డి కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు స్టైఫండ్ ఇవ్వాలి

ఆర్కేపురం, జనవరి 31 : జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేల స్టైఫండ్ ఇవ్వాలని న్యాయవాధులు రమణరావు, మంత్రి రవీందర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఎనిమిది హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జూనియర్ న్యాయవాదులు రంగారెడ్డి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సత్యనారాయణరెడ్డి, జోహర్, సుధాకర్, దత్త, మేఘన, రాధిక, తేజస్విని, మీనాక్షి, అర్చన, శ్రావన్, జానయ్య, రాంబాబు, వెంకట్, సునీత, మహేశ్, సురేందర్, తదితరులు ఉన్నారు.

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా డాక్టర్ వెంకటేశ్వరరావు

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా డాక్టర్ కె.వెంకటేశ్వరరావును నియమిస్తూ బుధవారం ఆ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ బుధవారం పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో డాక్టర్ వెంకటేశ్వరరావును నియమించారు. ఆయన ప్రస్తుతం యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

80 మంది విద్యార్థులకు నర్సింగ్ ఉద్యోగాలు

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ పొందిన 80మంది నర్సింగ్ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చినట్లు బుధవారం జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే శిక్షణ పొందిన వారిలో 266 మంది కాంట్రాక్టు పద్ధతిలో పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానల్లో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

2, 4న నుమాయిష్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

అబిడ్స్, జనవరి 31 : నుమాయిష్‌లో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో 2న, 4న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీసీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాశంకర్, కన్వీనర్ ముఖ్తార్ హైదర్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 31 : జిల్లాలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్), పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (ఎంపీ ల్యాడ్స్), క్రుషియల్ బ్యాలెన్స్ ఫండ్(సీబీఎఫ్), ప్రత్యేక నిధులు (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) తదితర అభివృద్ధి నిధులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి ఎం.మోహన్ రావు, జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాది రాపోల్ భాస్కర్ తదితరులు

ఒకేషనల్ స్కూళ్ల ఏర్పాట్లలో అవినీతి

ఏసీబీకి న్యాయవాది రాపోల్ భాస్కర్ ఫిర్యాదు

సైదాబాద్, జనవరి 31: ఒకేషనల్ స్కూళ్ల ఏర్పాటులో జరిగిన అవినీతిలో విద్యాశాఖ అధికారుల పాత్రపై విచారణ జరిపించాలని ఏసీబీ డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. బుధవారం కల్యాణ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా 2016లో తెలంగాణలో 450 ఒకేషనల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని అదేశాలు జారీ అయ్యాయన్నారు. అయితే, కేవలం 350 స్కూళ్లను మాత్రమే ఏర్పాటు చేసి, వాటికి సంబంధించిన నిధులను విద్యాశాఖ అధికారులు బ్యాంకులను నుంచి డ్రా చేసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒకేషనల్ స్కూళ్ల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలు, అవినీతికి పాల్పడ్డ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్‌పై విచారణ జరిపి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏసీబీ డీజీపీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు డాక్టర్ ప్రసంగి, దీనా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇస్లాముద్దీన్

డాక్టర్లలాగే.. మమ్మల్నీ రెగ్యులరైజ్ చేయాలి

స్టాఫ్ నర్సు కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్

ఖైరతాబాద్, జనవరి 31 : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్టాఫ్ నర్సు కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు డాక్టర్ ఇస్లాముద్దీన్, అసోసియేషన్ ప్రతినిధులు చైతన్య, సౌజన్య, మంజుల, నిర్మలతో కలిసి మాట్లాడారు. కరోనా సమయంలో స్టాఫ్ నర్సులు విశేష సేవలందించారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్యులను ఎలాంటి పరీక్షలు లేకుండానే రెగ్యులర్ చేశారని, అదే జీవోను తమకు వర్తింప చేయాలన్నారు. ట్రెజరీ ద్వారా వేతనాలతో పాటు ఆరోగ్య భద్రత, డీఏ, టీఏ, హెచ్ఆర్ఏలు చెల్లించాలన్నారు. వేతనంతో కూడిన ఆరునెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సొగరాబేగం, షేక్ సత్తార్, లాజర్, రాంచందర్, ఖలీల్ పాల్గొన్నారు.

వంటకాలను పరిశీలిస్తున్న టర్కీ గౌరవ కాన్సులర్ జనరల్ మేనేజర్ అభిలాషా బిస్ట్

ఐఐహెచ్ఏంలో యంగ్ చెఫ్ పోటీలు

శేరిలింగంపల్లి, జనవరి 31 : గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐఐహెచ్ఏం) క్యాంపస్‌లో ఇంటర్నేషనల్ ''యంగ్ చెఫ్ ఒలింపియాడ్'' పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా మలేషియా, జోర్డాన్, ఇరాన్, లక్సెంబర్గ్, శ్రీలంక, నైజీరియా, మాల్దీవులు, అర్మేనియా, ఐర్లాండ్ తదితర 10 దేశాలకు చెందిన యువ చెఫ్‌లు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఐఐహెచ్ఏం యంగ్ చెఫ్ -10 ఎడిషన్‌లో భాగంగా మొదటి రౌండ్‌లో శాఖాహార వంటలు, డజర్ట్స్ పోటీలు, స్కిల్ టెస్టులు నిర్వహించారు. టర్కీ గౌరవ కాన్సులర్ జనరల్ మేనేజర్ అభిలాషా బిస్ట్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఐహెచ్ఏం హైదరాబాద్ డైరెక్టర్ ఎర్నెస్ట్ ఇమ్మాన్యుల్‌తో పాటు పలువురు స్టార్ హోటళ్ల చెఫ్‌లు, వివిధ హోటల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాద సమయంలో సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తే తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. మెహిదీపట్నం చెన్నై షాపింగ్‌మాల్, రాజేంద్ర నగర్, అత్తాపూర్ మంత్రామాల్, కాచిగూడ డీ మార్ట్, హబ్సీగూడ అన్‌లిమిటెడ్ మాల్, పేట్‌బషీరాబాద్‌లోని పాంటలూన్ రిటైల్ షాప్‌లలో మాక్ డ్రిల్ నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

జీహెచ్ఎంసీలో జీఐఎస్‌కు టెండర్ నోటిఫికేషన్లు

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ జీహెచ్ఎంసీ పౌర సేవలను విస్తృతం చేయనున్నది. ప్రజలకు మెరుగైన సేవలందించడం, మార్గదర్శక అనుమతులు మంజూరు, సరళీకృతమైన విధానాలు అమలుచేస్తున్నది. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ కార్యకలాపాలను జీఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం) విధానంలోకి మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆసక్తిగల ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. జీహెచ్ఎంసీలో జీఐఎస్ విధానాన్ని అమలు చేసేందుకు ఆసక్తిగల ఏజెన్సీలు సంబంధిత ప్రతిపాదనలను సమర్పించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఏజెన్సీలు సమర్పించిన ప్రతిపాదనలకు ఫిబ్రవరి 10వ తేదీన ప్రీ బిడ్ మీటింగ్‌ను నిర్వహించి అర్హత ఉన్న ఏజెన్సీని ఎంపికచేయనున్నారు. ఈ టెండర్ ప్రక్రియ ఫిబ్రవరి 14న ముగియనున్నది. జీఐఎస్ విధానం అమల్లోకి వస్తే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట, పారదర్శక అనుమతులు, ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల సంస్కరణలు సులభతరం కానున్నాయి.

24, 25న న్యాయవాదుల క్రీడా పోటీలు

నాంపల్లి కోర్టులు, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24, 25న తేదీల్లో ఎల్బీ స్టేడియంలో న్యాయవాదులకు క్రీడలు నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు ఆలుగడ్డల అనిల్ ప్రకటనలో వెల్లడించారు. సొసైటీ స్పోర్ట్స్ కన్వీనర్ మణికొండ ప్రవీణ్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. న్యాయవాదులకు కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, చెస్, క్యారమ్స్, క్రికెట్ (మహిళలకు), టెబుల్‌టెన్నీస్, 100మీ.పరుగుపందెం, తదితర విభాగాల్లో పోటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆకుల మాణిక్‌ప్రభు, కార్యదర్శి పాలిశెట్టి రవి, సభ్యులు పాల్గొన్నారు.